ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్ రావు తెలిపారు. 55 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 16 కేంద్రాల్లో వృత్తివిద్య ప్రాక్టికల్స్ జరిగినట్లు ఆయన తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో 3,293 మందికి 3,126 మంది హాజరుకాగా 167 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షల్లో 2,893 మందికి 2,827 మంది హాజరు కాగా 66 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

ప్రాక్టికల్స్‌లో విద్యార్థులు

ఎంఎల్‌ఎలకు పట్టదు.. కలెక్టర్లు రారు..!

- తూతూమంత్రంగా తయారైన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం
- ప్రజా సమస్యల పరిష్కారం పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు
- సమస్యలపై ఏకరువు పెట్టిన స్థానిక ప్రజాప్రతినిధులు
- తూర్పు, పశ్చిమ కలెక్టర్లు హాజరుకాకపోవడంపై స్థానిక ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సభ నుంచి వాకౌట్ చేసేందుకు సిద్ధమై వెనక్కి
- ఈసారి కలెక్టర్లు రాకపోతే సమావేశం జరపను ; జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశం తూతూమంత్రంగా మారింది. ప్రజా సమస్యలకు వేదికగా మారాల్సిన సమావేశం నామకహ అన్నట్లు తయారైంది. అత్యంత ముఖ్యమైన జిల్లా పరిషత్ సమావేశానికి 15 మంది ఎంఎల్‌ఎలకుగాను ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు తప్ప, మిగిలిన ఎంఎల్‌ఎలు ఏ ఒక్కరూ హాజరు కాని పరిస్థితి. జిల్లా కలెక్టర్లు కూడా సమావేశానికి రాకపోతే తమ సమస్యలు ఎవరికి చెప్పు కోవాలంటూ పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పరిస్థితి నెలకొంది. ఆయా జిల్లాలకు చెందిన సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసేందుకు నిర్ణయించి వెనక్కి తగ్గిన పరిస్థితి కొనసాగింది. ఇక నుంచి జిల్లా కలెక్టర్లు హాజరుకాకపోతే జిల్లా పరిషత్ సమావేశం జరపనంటూ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసిన పరిస్థితి నెలకొంది. స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ అధ్యక్షులు ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) పశ్చిమగోదావరి జిల్లా రెవెన్యూ అధికారి శివ నారాయణ రెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ కె.సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులైన జెడ్‌పిటిసిలు సమస్యల ఏకరువు పెట్టారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక జెడ్‌పిటిసి కుంజా రామలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు మండలాలు కావడంతో విద్యుత్, రోడ్లు వంటి అనేక సమస్యలను పట్టించుకోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దెందులూరు, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మిగిలిన జెడ్‌పిటిసిలు మాట్లాడుతూ రోడ్లు, తాగునీరు, జగన్నకాలనీలో మౌలిక సదుపాయాలు వంటి అనేక సమస్యలను లేవనెత్తారు. నాడు - నేడు పనులు ముందుకు సాగడం లేదన్నారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదంటూ స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెట్టిన పరిస్థితి నెలకొంది.

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి : జెడ్‌పి ఛైర్‌పర్సన్

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. జిల్లా పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో జరిగే పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచి వంటి స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచార లోపం జరిగినట్లు ఫిర్యాదులు వస్తే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశాల్లో వివిధ శాఖల పనులకు సంబంధించి సభ్యులు వెలిబుచ్చిన సమస్యలపై తీసుకున్న చర్యలను సంబంధిత మండలస్థాయి ప్రజాప్రతినిధులకు కూడా తెలియజేయాలన్నారు. పేదప్రజల సంక్షేమానికి సామాజిక, ఆర్థిక, రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయడంతో పాటు సమాజంలోని అన్ని వర్గాలకూ సామాజిక న్యాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి నవరత్నాల కార్యక్రమం కింద మానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారన్నారు. ప్రభుత్వ పథకాల్లో ఎటువంటి అవినీతికి తావులేకుండా లబ్ధిదారులకు నేరుగా అకౌంట్‌లోనే జమ చేయడం జరుగుతోందన్నారు. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ చట్టం,

హాజరైన సభ్యులు

ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల ద్వారా మంజూరైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అనంతరం పనులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్లోడ్ చేయాలని తెలిపారు. సభ్యులు తెలియజేసిన సమస్యలపై జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ స్పందిస్తూ వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తోటకూరగొమ్ము, దాచారం, కొయిదా తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యకు మంచినీటి బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. జలకళ బోర్లు ఏర్పాటు, ఇళ్ల స్థలాల మంజూరు, నాడు-నేడు పనుల ప్రగతి, తదితర అంశాలపై సభ్యులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదుచేయండి : జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. పేదల ఇళ్ల పథకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలో జగనన్న భూ హక్కు, భూసర్వే కార్యక్రమం కింద అధునాతన పద్ధతిలో డ్రోన్ల ద్వారా రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టామని, సదరు జాబితాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. సర్వే అనంతరం సదరు భూ యజమానుల నుంచి సక్రమంగా ఉన్నాయని అంగీకారం తీసుకుంటారని, యజమానులు అభ్యంతరం వెల్లడించినట్లయితే సదరు సమస్య పరిష్కరించి, తరువాత మాత్రమే భూ హక్కు సర్వే పత్రం ముద్రించి సదరు రైతుకు అందించడం జరుగుతుందని సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కలెక్టర్ చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యను మినిట్స్‌లో నమోదు చేసి, తదుపరి సమావేశంలో సదరు సమస్యపై తీసుకున్న చర్యలను తెలియజేయాలన్నారు.

90 శాతం పనులు పూర్తయ్యాయి.. వినియోగంలోకి తీసుకురండి ; పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ

ఉంగుటూరు నియోజకవర్గంలో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మిస్తున్న పాఠశాలల అదనపు తరగతి గదులు, అంగన్వాడీ భవనాలు, ఇతర నిర్మాణ పనుల్లో కొన్ని 90 శాతం పూర్తయ్యాయని, డోర్లు, ఫర్నీచర్ వంటి కొన్ని సౌకర్యాలు కల్పించినట్లయితే వెంటనే వినియోగంలోకి తీసుకురావచ్చని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) కోరారు. అధికారులు ఆ దిశగా పనిచేయాలన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిలో కలపర్రు నుండి గుండుగొలను మధ్య రోడ్లు గుంతల కారణంగా వాహనాలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో రహదారి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇటీవల ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దెందులూరు తాజా, మాజీ ఎంఎల్‌ఎల మధ్య ఘర్షణపై ఆరోగ్యశాఖ అధికారుల తీరుపైనా చర్చ కొనసాగింది.

డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, గృహనిర్మాణ శాఖ పీడీ కె.రవికుమార్, వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ట్రాన్స్‌కో, సూపరింటెండింగ్ ఇంజినీర్లు శ్రీనివాసరావు, కేథారేశ్వరరావు, సత్యనారాయణ, సాల్మన్ రాజు, డిఎంహెచ్ఒ శర్మిష్ఠ, డ్వామా పీడీ ఎ.రాము, జెడ్‌పిటిసిలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో ఎన్‌ఆర్‌ఐ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - ఏలూరు

మంగళవారం ప్రకటించిన జెఇఇ(మెయిన్) ఫేస్-1 ఫలితాల్లో ఏలూరు ఎన్‌ఆర్‌ఐ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల సిఇఒ వి.తులసీరామ్ తెలిపారు. జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధించిన ఎన్‌ఆర్‌ఐ కళాశాల విద్యార్థులు జె.జగన్నాథ సూరి 99.85 శాతం, ఎమ్.వెంకట నాగరోహిత్ 99.81 శాతం, ఎన్.లీలా వెంకటసాయి 98.49 శాతం, పి.వంశీకృష్ణ 98.23 శాతం, ఎమ్.షన్ముక్ 96.87 శాతం, జివి.ప్రభుకార్తీక్ 96.63 శాతం, జి.సాయికృష్ణ 94.35 శాతం, ఎన్.తనూష్ 92.44 శాతం, పి.పీతమ్ సాయి 90.02 శాతం సాధించారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అనంతరం తులసీరామ్ మాట్లాడుతూ కేవలం అనుభవం, అంకితభావం కలిగిన సీనియర్ అధ్యాపకుల వివరణాత్మక భోధన, విద్యార్థుల కృషితో ఈ అద్భుత ఫలితాలు సాధించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపల్స్ వి.కనకరత్నం, ఇ.మురళీకృష్ణ, కె.ప్రభాకరరావు, ఎస్.సత్యనారాయణ, సి హెచ్.శివకుమార్, కళాశాల ఎఒలు కె.మల్లిఖార్జునరావు, వి.రాట్నాలు, ఎస్.రామాంజనేయులు, జె.నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు : ఎన్‌ఆర్‌ఐ విద్యార్థులతో అధ్యాపకులు

భీమడోలు: భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కె.వంశీకృష్ణ మంగళవారం వెలువడిన జెఇఇ మెయిన్ పరీక్షల్లో 99.80 పర్సంటేజ్ సాధించి పాఠశాల గౌరవాన్ని పెంచారని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ తెలిపారు. పదవ తరగతి వరకు మానస పాఠశాలలో చదివిన వంశీకృష్ణ అప్పట్లో నిర్వహించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 10/10 సాధించారని తెలిపారు. వంశీకృష్ణ తల్లితండ్రులు మండలంలోని వివిధ సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. పరీక్షల్లో అత్యధిక పర్సంటేజ్ సాధించిన వంశీకృష్ణను పాఠశాల యాజమాన్యంతో పాటు పలువురు ప్రముఖులు అభినందించారు.

మాట్లాడుతున్న మంతెన సీతారాం

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులకు, ప్రజలకు తీవ్ర నష్టం కల్గించే వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్టు (భూ హక్కుల చట్టం) రద్దు చేయాలని, ప్రజా ఉద్యమాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధం విడనాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం సిపిఎం జిల్లా కమిటీ సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పలు ప్రజా సమస్యలపై తీర్మానాలు చేసి ఆమోదించింది. ఈ సమావేశానికి ముఖ్యవక్తగా విచ్చేసిన సీతారాం మాట్లాడుతూ రాష్ట్ర వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్టు సన్న, చిన్నకారు రైతులు, మధ్యతరగతి రైతులకు ప్రమాదకరమైందన్నారు. ఒక పక్క బడుగు, బలహీన వర్గాలను ఉద్ధరిస్తామని చెబుతూనే మరో పక్క ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చిన్న, సన్నకారు రైతులు, పేద, మధ్యతరగతి రైతులకు నష్ట కల్గించే చట్టం తీసుకురావడం ఏంటని ప్రశ్నించారు. భూ సమస్యలు ఎక్కువగా రెవెన్యూ అధికారుల తప్పుడు నిర్ణయాల వల్లే వస్తుంటాయని, అలాంటి అధికారులకు అధికారం అప్పగించి కింద స్థాయిలో ట్రిబునల్ అని పేరు పెట్టి భూ సమస్యలు పరిష్కరించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు. రైతుల భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ ఆదేశాల మేరకు నీతిఆయోగ్ తయారు చేసిన చట్టాన్ని దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయకపోయినా మన రాష్ట్రంలో జగన్ కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి అమలు చేయడం అన్యాయమన్నారు. ఈ చట్ట ప్రకారం పేదలు మెజిస్ట్రేట్ కోర్టులకు, సివిల్ కోర్టులకు వెళ్లే అవకాశం లేదన్నారు. హైకోర్టులకు మాత్రమే పోవాలని, ఇది పేద రైతులకు సాధ్యమేనా అని అవేదన వ్యక్తం చేశారు. 50 సెంట్లు, ఎకరం భూములకు కూడా వివాదం వస్తే సమస్య పరిష్కారం కాకపోతే రైతులకు దాని ధర కంటే కోర్టు ఫీజుల ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. భూ వివాదం పరిష్కారం కాకుండా పేద రైతులు అన్యాయమైపోతారని చెప్పారు. రైతు, ప్రజా వ్యతిరేక భూ హక్కుల చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన కార్మికవర్గ సమ్మెల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా అణచివేతకు పాల్పడిందని విమర్శించారు. ట్రేడ్ యూనియన్ నాయకులతోపాటు, కార్మికవర్గ సమ్మెలకు మద్దతు ప్రకటించిన సిపిఎం నాయకులపైనా ఉక్కుపాదం మోపిందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. గత ఎన్నికల్లో ఈ పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.30 లక్షల పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసగించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధులు కేటాయించాలని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిల సాధనకు 27న చలో విజయవాడ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల సాధనకై ఈ నెల 27వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ స్టాఫ్ సంఘం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల, ఉపాధ్యాయుల, పెన్షనర్ల పట్ల అవలంబిస్తున్న తీరుకు తాము అనేకసార్లు మంత్రివర్గ ఉప సంఘాన్ని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాల్లోనూ చర్చించి చీఫ్ సెక్రటరీని కలిసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. అనేక రూపాల్లో ఆందోళనలు చేశామని తెలిపారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, జిపిఎఫ్ లోన్లు సకాలంలో రాకపోవడం, ఎపి జిఎల్ఐ లోన్ల సర్వర్లు పనిచేయకపోవడం, అదేవిధంగా మెడికల్ రీయంబర్స్‌మెంట్ రాకపోవడం, కోవిడ్‌లో మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు ఇవ్వాలని తదితర సమస్యలను విన్నవించినా స్పందన లేదన్నారు. సోమవారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, మంత్రివర్గంతో జరిగిన చర్చల్లో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణ, చీఫ్ సెక్రటరీలను 12వ పిఆర్‌సికి సంబంధించి ఐఆర్ ఇవ్వాలని కోరినా ప్రభుత్వం దిగి రాలేదన్నారు. సిపిఎస్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల 90 శాతం బకాయిలు నేటికీ ప్రభుత్వం విడుదల చేయకపోగా ఐఆర్‌ను ప్రస్తుతం ప్రకటించలేమని, నేరుగా పిఆర్‌సి ఇస్తామని బొత్స సత్యనారాయణ చెప్పారని తెలిపారు. దానికి ఉద్యోగ సంఘం నేతలు ఒప్పుకోలేదని, ఈ నేపథ్యంలో జెఎసి ముందుగా ప్రకటించిన దశలవారీ ఆందోళనలో భాగంగా బుధవారం నుంచి ప్రతి ఆఫీసులో బ్లాక్ బాడ్జెస్ పెట్టి కలెక్టర్, తహశీల్దార్, ఆర్‌డిఒ వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. 15, 16 తేదీల్లో లంచ్ అవర్ డెమోనిస్ట్రేషన్ చేస్తామని, అలాగే 17వ తేదీన ర్యాలీలు, ధర్నాలతో తాలూకా హెడ్ క్వార్టర్స్ వద్ద ఉదయం పది నుంచి ఐదు గంటల వరకూ చేస్తామని, 20న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు చేస్తామని, 27న చలో విజయవాడ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మిక పెన్షనర్లు పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జెఎసి కన్వీనర్ రామారావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.రవికుమార్, ముస్తఫా ఆలీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చోడగిరి శ్రీనివాసరావు

రైతులపై మోడీ ప్రభుత్వ చర్యలు దారుణం

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతులు శాంతియుతంగా నిర్వహిస్తున్న చలో ఢిల్లీపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్బంధ చర్యలకు దిగడం దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీ హర్యానా సరిహద్దుల్లో ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్లు, పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు మోహరించి రైతులపై మోడీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఏలూరు అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు 13 నెలల పాటు నిర్వహించిన ఉద్యమం సందర్భంగా కేంద్ర మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయకపోవడం వలన మరో దశ ఉద్యమానికి రైతులు సమాయత్తమయ్యారని చెప్పారు. ఇచ్చిన హామీ ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకొచ్చి దేశవ్యాప్తంగా ఒక దఫా రైతుల రుణాలు మాఫీ చేయాలన్నారు. ఢిల్లీ రైతులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమంలో మరణించిన రైతు కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని కోరారు. రైతుల డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా దెందులూరు

ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం పెదపాడు మండలం వసంత వాడలో జరుగుతున్న మూడోవిడత పాదయాత్రలో పాల్గొన్న ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించి వారిలో దాగి ఉన్న నైపుణ్యతకు పదును పెట్టి, వారిని ప్రపంచస్థాయిలో ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు నూతన ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నూతన విద్యా సంస్కరణలతో పాటు అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయంగా పనిచేస్తున్నట్టు అన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదవేగి జెడ్‌పి ఉన్నత పాఠశాల, కొవ్వలి జెడ్‌పి ఉన్నత పాఠశాలలను హై స్కూల్ ప్లస్‌లుగా అప్ గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. అనంతరం ప్రజలు ఎంఎల్‌ఎ పని తీరును ప్రశంసించారు. నియోజక వర్గంలో రెండు పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణలకు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులతో ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి

డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతుల దహనం

ప్రజాశక్తి - చింతలపూడి

డిఎస్‌సి-2024 నోటిఫికేషన్ ద్వారా అమలుచేస్తున్న అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రతులను మంగళవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ దాదాపు ముప్పై సంవత్సరాలు పోరాడి సాధించుకున్న అప్రెంటిస్ రద్దును ముఖ్యమంత్రి అమలులోకి తీసుకురావడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఏ డిపార్ట్మెంట్‌లోనూ లేని అప్రెంటిస్‌ను ఈ డిపార్ట్మెంట్‌లో తీసుకురావడం దారుణమన్నారు. ఈ చర్య రాబోయే ఉద్యోగుల పాలిట శాపమన్నారు. ఇలాంటి తిరోగమన జిఒని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు దామోదర్, ప్రధాన కార్యదర్శి కంచర్ల బుచ్చిబాబు, చంచంరాజు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతులు దగ్ధం చేస్తున్న నేతలు

నాలుగో విడత వైఎస్‌ఆర్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

నియోజకవర్గ అభివృద్ధితో పాటు, సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యత ఇస్తూ, వాటిని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి అండగా నిలవాలని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసు బాబు కోరారు. మండల పరిధిలో వైఎస్‌ఆర్ ఆసరా వారోత్సవాల కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో భాగంగా గుండుగొలను రైతు సహకార వేదిక ఆవరణలో మంగళవారం గుండుగొలను, కోరుకొల్లు, లక్ష్మీపురం గ్రామపంచాయతీలకు చెందిన 320 డ్వాక్రా సంఘాలకు నాలుగవ విడత ఆసరా రుణమాఫీగా మంజూరైన రూ.2.03 కోట్లు చెక్కును ఎంఎల్‌ఎ లబ్ధిదారులకు అందజేశారు.

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వాసుబాబు

ఈ సందర్భంగా వైసిపి గుండుగొలను పార్టీ అధ్యక్షులు, గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు గుండుగొలను గ్రామ అభివృద్ధికి ఎంఎల్‌ఎ అందజేసిన సహాయ, సహకారాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనమాల రామయ్య, గ్రామ సర్పంచి కె.లక్ష్మి, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ

పోలవరం : మండలంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పేద విద్యార్థులకు(పాఠశాల పూర్వ విద్యార్థులు), ప్రస్తుతం ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న ఉప్పే మహా లక్ష్మయ్య, హెచ్.శ్రీనివాసశాస్త్రి, డి.సత్యనారాయణలు పదోతరగతి యుటిఎఫ్ ఆల్ ఇన్ వన్ టెస్ట్ పేపర్లను ఉచితంగా మంగళవారం అందజేశారు. చదువు ఒకటే తరగని ఆస్తి అని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఇంతటి వారిమి అయ్యామని తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు రాస్తున్న పేద విద్యార్థులు కూడా ఉత్తీర్ణులు కావాలని, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.

'డ్వాక్రా మహిళలకు ఆసరాగా జగన్'

చింతలపూడి: డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్, చింతలపూడి నియోజకవర్గ వైసిపి ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయ రాజు అన్నారు. చింతలపూడి పట్టణంలో వికెఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జగ్గవరపు జానకి రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో తమను మహిళలందరూ అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంపిపి డాక్టర్ రాంబాబు, జెడ్‌పిటిసి నీరజ, మండల సచివాలయాల కన్వీనర్ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సరోజినీ నాయుడు జయంతి

నూజివీడు రూరల్: కృష్ణ యూనివర్సిటీ పరిధిలోని డాక్టర్ ఎంఆర్ అప్పారావు పీజీ సెంటర్‌లో సరోజినీ నాయుడు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బసవేశ్వర రావు మాట్లాడుతూ 13వ ఏటనే 'ది లేడీ ఆఫ్ ది లేక్' పేరుతో 1300 లైన్లతో కవితను రాసి సరోజినీ నాయుడు పేరు ప్రఖ్యాతులు సంపాదించారని తెలిపారు. సరోజినీ నాయుడును విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని, ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీజీ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

నూజివీడులో స్కూల్ కాంప్లెక్స్

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో డివిజన్‌లోని జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు కాంప్లెక్స్ శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాత్రాయి ఎంఇఒ సత్యవీర బ్రహ్మాచార్యులు మాట్లాడుతూ పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన అనే అంశాలు నిత్యకృత్యంగా కొనసాగుతుంటాయని తెలిపారు. మెరుగైన పద్ధతిలో పాఠశాల నిర్వహణ బాధ్యతలు నిర్వహించేందుకు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు.

బాలురకు స్పోర్ట్స్ కిట్లు అందజేత

ఏలూరు సిటీ: బాలుర గృహంలో ఉన్న బాలురకు నై దిశా కార్యక్రమంలో భాగంగా వాలీబాల్, షటిల్, బ్యాట్మెంటన్, చెస్‌కు సంబంధించిన స్పోర్ట్స్ కిట్లను శనివారం ఐఓసి(ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) చెందిన వి.కుమార్ డిజిఎం(హెచ్‌ఆర్), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆఫీస్ జెబిఎస్ విద్యాధర్ మేనేజర్, పి.తిమ్మప్ప సెక్షన్ ఆఫీసర్ హెచ్‌ఆర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ బాలుర గృహం శనివారం పేటలో పంపిణీ చేసి ఆటలలో నైపుణ్యతకు శిక్షకులను కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్రొబెలేషన్ సూపరిండెంట్ టి.మధుసూదన్, డాక్టర్ పి.కిషోర్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, జై.మోహన్ రావు పాల్గొన్నారు.

కాంతారావుకు సత్కారం

ఏలూరు అర్బన్: చిత్రకళా రంగంలో ఎంతో విశిష్టత కలిగి ఎందరో శిష్యులను అందించిన ఘనత మజ్జి కాంతారావుకే దక్కుతుందని, వారిని సత్కరించుకోవడం చాలా సంతోషకరమని చిత్ర కళాకారులు పేర్కొన్నారు. క్రియేటివ్ ఆర్ట్స్, అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఏలూరుకి చెందిన చిత్రకళలో ఎంతో విశిష్టత కలిగిన మజ్జి కాంతారావుని ఘనంగా సత్కరించారు. ఈనెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్ సాలార్జంగ్ మ్యూజియం వేదికగా నిర్వహిస్తున్న 'మాస్టర్ స్ట్రోక్' కార్యక్రమాన్ని పురస్కరించుకొని సంస్థ నిర్వాహకులు అంజి ఆకొండి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎంవి రెడ్డి మంగళవారం శాలువా, ప్రత్యేక ప్రశంసా పత్రంతో సత్కరించారు.

ఎంపిపిని కలిసిన ఎంపిడిఒ

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండల అభివృద్ధి అధికారిగా నియమితులైన అశోక్ కుమార్ బుధవారం మండల పరిషత్ అధ్యక్షులు గంజిమాల రామారావును మర్యాద పూర్వకంగా కలిశారు. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం ఎంపిడిఒగా పనిచేసిన తాను ఎన్నికలు ముగిసే వరకు ఇక్కడ పనిచేస్తానని ఎంపిడిఒ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి రామారావు పలు సూచనలు చేశారు. ఇక్కడ ఉన్నంతకాలం పారదర్శకంగా పని చేయాలని, 12వ తేదీన జరిగే మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులందరూ హాజరయ్యేలా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్ బాజీ, ఇఓపిఆర్‌డి సురేష్, ఎంపిడిఒ ఆఫీస్ సూపరింటెండెంట్ కె.స్వామి పాల్గొన్నారు.

'కార్యకర్తలకు అండగా టిడిపి'

చింతలపూడి: కార్యకర్తలకు టిడిపి ఎప్పుడు అండగా ఉంటుందని చింతలపూడి నియోజకవర్గ యువ నాయకులు సొంగ రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో టిడిపి కార్యకర్త పెద్దకర్ల వెంకటేశ్వరరావుకు ప్రమాదం జరిగి ఇంటి వద్ద ఇబ్బందులు పడుతున్న విషయం గ్రామ అధ్యక్షులు, పసునూరి సుబ్బారావు, ఇతర నాయకుల ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సొంగ రోషన్ కుమార్ వెంటనే స్పందించి వారి ఇంటికి వెళ్లి వెంకటేశ్వరరావును పరామర్శించి అతనికి నెలకు రూ.2 వేలు చొప్పున నాలుగు నెలలు పెన్షన్ ఇస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామ పెద్దల సమక్షంలో పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మందపాటి పాపారావు, తాళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నల్లరిబ్బన్లతో మున్సిపల్ ఉద్యోగుల నిరసన

ఏలూరు అర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు ఆర్‌ఆర్ పేట సర్వీస్ రిజర్వాయర్ రెండు వద్ద ఉద్యోగ సిబ్బంది నల్ల రిబ్బనులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని మున్సిపల్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి బి.నారాయణరావు, జాయింట్ సెక్రెటరీ డి.వెంకటేశ్వరరావు, యూనియన్ నాయకులు ఎస్ఎంవి సుబ్బారావు పాల్గొన్నారు.

చింతలపూడి: సమ్మె విరమణ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం, ఉన్నతాధికారులు ఇచ్చిన హామీలకు వెంటనే జిఒలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి పిలుపుమేరకు చింతలపూడి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు మాట్లాడుతూ సమ్మె విరమణ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను జిఒల రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వెలగాడి అనురాధ, శ్రీరామ్ వెంకటయ్య, శ్రీరామ్ కోటయ్య, మానుకొండ సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఏలూరు స్పోర్ట్స్: ఏలూరు ఆర్ఆర్‌పేటకు చెందిన ఒక మహిళ తీవ్ర మనస్థాపానికి గురై రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నర్సింహరావు తెలిపిన వివరాల ప్రకారం ఈదరవారి రోడ్డుకు చెందిన సంబారు కనకదుర్గ వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఉదయం ఏలూరు పవరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మతదేహాన్ని ఏలూరు జిజిహెచ్‌కు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జీలుగుమిల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని దర్భగూడెం గ్రామ శివారులో మంగళవారం ఎస్ఐ, సిబ్బంది ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా సిర్రివారి గూడెం కాలువ నుంచి అక్రమంగా ఇసుకతో దర్భగూడెం వైపుకి వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ముసునూరు: మండలంలోని బలివే గ్రామంలోని తమ్మిలేరు అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మంగళవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి దాడి చేసి ఆ రెండు ట్రాక్టర్లుకు రూ.10 వేలు జరిమాన విధించి, రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మా పొట్ట కొట్టొద్దు..

అటవీశాఖ అధికారికి మత్స్యకారుల వినతి

ప్రజాశక్తి - పోలవరం

పాపికొండల అభయారణ్యం పరిధి గోదావరిలో ఇతర ప్రాంత మత్స్యకారులు చేపల వేట సాగిస్తూ స్థానిక మత్స్యకారులకు ఉపాధి పోగొడుతున్నారంటూ మంగళవారం పోలవరం అటవీశాఖ క్షేత్రాధికారి ఎన్.దావీదు రాజుకి మత్స్యకారులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణానంతరం ప్రాజెక్టు దిగువన నదిలో చేపల సంతతి తగ్గడం వల్ల తాము ఉపాధి కోల్పోయామన్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లోని తూటిగుంట, కొండమొదలు, కొత్తూరు, వీరవరం, టేకూరు నిర్వాసిత గ్రామాల్లో ఉన్న మత్స్యకారులంతా ఉపాధి కోల్పోవడం వల్ల అధికారులు తమకు ప్రాజెక్టు ఎగువన చేపల వేటకు అనుమతులు ఇచ్చారన్నారు. ఇటీవల రాజమండ్రి,

అటవీశాఖ అధికారికి వినతినిస్తున్న మత్స్యకారులు

కొవ్వూరు ప్రాంతాల నుంచి కొంతమంది మత్స్యకారులు 100 బోట్లతో ప్రాజెక్టు ఎగువ నేషనల్ పార్క్ ప్రాంతాలకు వెళ్లి మత్స్యశాఖ నిబంధనలకు, నేషనల్ పార్క్ అటవీ చట్టం 2008కి విరుద్ధంగా పాపికొండల జాతీయ పార్కు పరిధిలోకి వెళ్లి, అక్కడే మకాం వేసి చీరమేన్ అవిలి(అప్పుడే పుట్టిన చేపలను సైతం పట్టి చిన్న కన్నాలు గల వల)లతో చిన్నచిన్న చేపలను సైతం పట్టి, అక్కడే ఎండబెట్టి భారీ ఎత్తున ఇతర ప్రాంతాలకు లారీలలో ఎగుమతి చేస్తున్నారన్నారు. దీనివల్ల మత్స్య సంపద తగ్గి తమ ఉపాధి కోల్పోతున్నామన్నారు. ఇతర ప్రాంతాల మత్స్యకారుల చొరబాటును అరికట్టి తమ ఉపాధిని కాపాడాలని కోరారు. ఈ విషయంపై అటవీక్షేత్ర అధికారి ఎన్.దావీదు రాజు మాట్లాడుతూ నేషనల్ పార్క్ పరిధిలో మకాం ఉంటున్న మత్స్యకారులను దిగువ ప్రాంతాలకు తీసుకురావడం జరిగిందని, ఈ విషయంపై సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, ఐటిడిఎస్ డైరెక్టర్ గంగు అనిల్ కుమార్ పాల్గొని అటవీ శాఖ అధికారులకు సమస్యలు వివరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలి

జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు : ప్రజల్ని నిలువు దోపిడి చేస్తున్న వైసిపికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం ఏలూరు జనసేన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తుగ్లక్ పాలన కొనసాగుతుందనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. సాధారణ పౌరులు, మానవులు జీవించేటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో లేదన్నారు. ఎందుకంటే వ్యక్తులపైన, వ్యవస్థలపైన తెలియకుండా అనేక రూపాల్లో ప్రజలపై బాదుడు మోపి ప్రజల నడ్డి విరిచే వైఖరి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో కనిపిస్తుందన్నారు. కరెంటు చార్జీలు ఆకాశనంటుతున్నాయన్నారు. వాహన చోదకులకు వాహన మిత్ర ఇచ్చి ఆటోలు మీద అధిక చార్జీలు వేసి, వాళ్లని వేధించే పరిస్థితి అధికమైందన్నారు. టూ వీలర్, ఫోర్ వీలర్ మీద చార్జీలు అధికంగా మోపుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో అన్యాయాలు పెరిగిపోయాయన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. వైసిపి అనేక వ్యాపార సంస్థలు మూత పడేటట్టు చేస్తుందని తెలిపారు. ఈరోజు సామాన్యులకు ఉపాధి కల్పించలేని జగన్మోహన్ రెడ్డి నిత్యావసరాల రూపంలో ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

త్వరలో ఏలూరులో పవన్ కళ్యాణ్ రోడ్డు షో

త్వరలో ఏలూరులో జరగబోయే జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ రోడ్ షో, భారీ బహిరంగ సభకు సంబంధించి రూట్ మ్యాప్, సభ స్థలాన్ని గోదావరి జిల్లాల ఎలక్షన్ ప్రోగ్రామ్స్ కన్వీనర్ బివి.రాఘవయ్య చౌదరితో కలిసి రెడ్డి అప్పలనాయుడు పరిశీలించారు. 14వ తేదీ నుంచి భీమవరం, నర్సాపురంలో పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారని, ఈనెల 17వ తేదీ వరకు సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తారన్నారు. త్వరలో ఏలూరులో పవన్‌కళ్యాణ్ పర్యటించనున్నారని తెలిపారు. వచ్చిన సమాచారం ప్రకారం రోడ్డు షోలో భాగంగా పవన్ కళ్యాణ్

మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

కైకలూరు మీదుగా గడియార స్తంభం, పాత బస్టాండ్ నుంచి ఫైర్ స్టేషన్ సెంటర్, అశోక్ నగర్ పత్తేబాద మీదుగా డీమార్ట్, 12 పంపుల సెంటర్‌కి చేరుకుంటారన్నారు. 12 పంపుల సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని పార్టీ అధిష్టానం సూచించడం జరిగిందని తెలిపారు. అధిష్టానం షెడ్యూల్ వివరాలు త్వరలోనే ప్రకటిస్తానన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్ పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

అలగా రవికుమార్

ఏలూరు టౌన్: 2024లో జరగబోయే ఎన్నికలలో దెందులూరు నియోజకవర్గం నుంచి తాను స్వతంత్ర ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేస్తానని అలగా రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన పెదవేగి మండల కేంద్రం దళితవాడలో దళిత నాయకుడు ముద్దుల స్వామినాదం గృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను దెందులూరు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నానని తెలిపారు. ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీల ఎంఎల్‌ఎ అభ్యర్థులు ఎన్నికల్లో గెలిస్తేనే ప్రజలకు సేవ చేస్తారని, గెలవక పోతే ప్రజలకు అందుబాటులో ఉండరని తెలిపారు. తాను 20 సంవత్సరాలుగా కుల మతాలకు అతీతంగా జిల్లా వ్యాప్తంగా అన్ని అణగారిన వర్గాలకూ సేవ చేస్తున్నానని చెప్పారు. దెందులూరు నియోజకవర్గం అంటేనే అగ్రవర్ణాల ఆధిపత్య పోరుకు అడ్డాగా మారిందన్నారు. ఓటు వేసి గెలిపిస్తే ప్రజల సమస్యలు పరిష్కరించి, వారికి అన్నివేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరిపల్లి పెద్దిరాజు, ఏలూరు జిల్లా అధ్యక్షులు అగస్టీన్ జిల్లా కార్యదర్శులు మద్దుల స్వామిదాసు పాల్గొన్నారు.

మిరప రైతులకు అవగాహన

చింతలపూడి: మిరపలో కాయ కుళ్లు తెగులు(తాలూకాయల) సమస్యకు రైతులు చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని ఎమ్‌డి షాఫియా అన్నారు. లింగమల మండలం ధర్మాజీగూడెంలో ఈ ఏడాది మిర్చి రైతులకు తీవ్ర నష్టం కలిగించిన తాలూకాయల సమస్య, దీని నివారణ చర్యలపై ధర్మాజీగూడెం మిర్చి రైతులకి మంగళవారం అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటి దశలో చిన్న నల్ల మచ్చలు ఏర్పడతాయని, దాని తరువాత కాయ అంతటా వ్యాపించి తాలూకాయలుగా మారతాయని అన్నారు. ఈ తెగులు పొగ మంచు వాతావరణం, తక్కువ ఉష్ణోగ్రత వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రొపికొనజోల్ 1 మాల్ 1.5జి/లీటర్ నీటికి పిచికారీ చేయాలని తెలిపారు. రొటేషన్ పద్ధతిలో మార్చి మార్చి పిచికారీ చేయాలని అన్నారు. చివరి దశలో అజాక్సిస్ట్రోబిన్/ప్రిక్లోస్ట్రోబిన్ ం మెటీరామ్ పిచికారీ చేయాలన్నారు. ఉదయం 10-మధ్యాహ్నం 4 లోపు కాయలు కోయాలన్నారు. తేమశాతం 10 శాతంకి తగ్గాక బస్తాల్లోకి వేయాలని తెలియజేశారు.

రుణాలు మంజూరు చేయాలి

చింతలపూడి: స్వల్పకాలిక రుణాలు తీసుకునే రైతులు, కౌలు రైతులకు ఎటువంటి జామీను అడగకుండా రుణాలు మంజూరు చేయాలని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ బ్యాంకు వద్ద రైతులు, కౌలు రైతుల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ చింతలపూడిలో ఉన్న యూనియన్ బ్యాంకు పరిధిలో రైతులకు పంట రుణాలు ఇవ్వాలని, నిబంధనల ప్రకారం రూ.లక్షా 60 వేల వరకు ఎటువంటి హామీ లేకుండా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈ ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ పాల్గొన్నారు.

టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శిగా రాము

ముదినేపల్లి: గురజ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు అడుసుమిల్లి రామకృష్ణ(రాము)ని జిల్లా టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు మంగళవారం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట కోటిలింగం బాబు రామకృష్ణకి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి చలసాని జగన్మోహనరావు, టిడిపి నాయకులు పెన్మెత్స వెంకటేశ్వరరాజు, మండల టిడిపి అధ్యక్షులు చళ్లగుళ్ల శోభనాద్రి చౌదరి, కైకలూరు మండల టిడిపి అధ్యక్షులు పెన్మెత్స త్రినాథ్ రాజు, వీరాబత్తిన సుధ, పాండు రాముకి శుభాకాంక్షలు తెలిపారు.

గోవిందరాజుకు ఎంఎల్‌ఎ నివాళి

ముదినేపల్లి: మండలంలోని బొమ్మినంపాడు గ్రామ మాజీ సర్పంచి, వైసిపి సీనియర్ నాయకులు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కరేటి గోవిందరాజుల పార్థీవ దేహాన్ని మంగళవారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే ఎంఎల్‌ఎ తనయులు దూలం వీర ఆది వినయ్ కుమార్, దూలం వీర శ్యామ్ ఫణి కుమార్, ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు మెట్రూ ఏసుబాబు నివాళు లర్పించారు.

అమ్మఒడి పేరుతో జగన్ దగా

దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్

ఏలూరు టౌన్: అమ్మఒడి పేరుతో జగన్ తల్లులను మోసం చేసి గద్దె నెక్కారని, అటువంటి మోసగాడిని గద్దె దించాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ మాజీ విప్, దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం ఏపూరులో సోమవారం జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన 6 గ్యారంటీ పథకాల విశిష్టతను ప్రజలకు వివరించారు. తమ గ్రామానికి విచ్చేసిన చింతమనేనికి పూల జల్లులు, మహిళల మంగళ హారతులతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి చంద్రన్న ప్రవేశపెట్టిన మహిళా శక్తి పథకం సహా పలు పథకాల విశిష్టతను వివరించారు. ఎన్నికల ముందు పాదయాత్ర చేసిన జగన్ అమ్మఒడి పేరుతో చదువుకునే ప్రతి బిడ్డకి ఏడాదికి రూ.15 వేలు సాయం అందిస్తానని అబద్ధపు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంటిలో ఒక బిడ్డకే ఇస్తాను అని మాట మార్చి మోసం చేసాడని విమర్శించారు. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుతున్న ప్రతి ఒక్కరికి కూడా ఏడాదికి రూ.15 వేలు అందించబోతున్నారని, వీటితో పాటు మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేయబోతున్నారని అన్నారు. అనంతరం ఏపూరులో జరుగుతున్న పాదయాత్రలో తమ్మినేని తాతారావు, రాజులపాటి సత్యనారాయణ, రాజులపాటి శ్రీనివాస్ సహా 20 కుటుంబాలు వైసిపిని వదిలి టిడిపిలో చేరగా చింతమనేని ప్రభాకర్ వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా

భవిష్యత్ గ్యారెంటీలో చింతమనేని

ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్‌ఛార్జి గుత్తా అనిల్, సీనియర్ నాయకులు ఉప్పలపాటి రాంప్రసాద్, తాతా సత్యనారాయణ, పార్లమెంట్ సెక్రటరీ మోరు శ్రావణి పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం ప్రత్యేక గిరిజన జిల్లా టిడిపితోనే సాధ్యమని టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోలవరం పంచాయతీ బాపూజీ కాలనీలో మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండల టిడిపి నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ మాట తప్పను.. మడమ తిప్పనంటూ ప్రజలను మభ్యపెట్టి, ఇచ్చిన హామీలు మరిచి అటు ప్రజల్ని, ఉద్యోగుల్ని రోడ్లపై నిలబెట్టారన్నారు. రానున్న రోజుల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుంచే దొరబాబు, మంగినకొండ, గుబ్బా రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మానవ విలువలు దిగజారిపోతున్న నేటి రోజుల్లో పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయ కమిటీ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం లాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాల్సి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. నగరంలోని పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని సీనియర్ సిటిజన్ మీసాల సూర్యనారాయణ(95), సువ్వాడ సింహాచలం రామారావులను పూలదండలు, శాలువాలతో సన్మానించారు. కుటుంబ విలువలు దిగజారిపోతున్న పరిస్థితుల్లో సువ్వాడ సింహాచలం, రామారావు తన భర(35) సంవత్సరాలుగా మంచం మీదే ఉన్నా అన్ని పరిచర్యలు చేస్తూ ఆదర్శవంతమైన

సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తూ..

సతీమణిగా నేటి సమాజానికి ఆదర్శవంతంగా నిలిచారని తెలిపారు. అలాగే మీసాల సూర్యనారాయణ(95) నేటికి మంచి ఆరోగ్యంతో జీవించడం కూడా ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనం ఈ మధ్యకాలంలో జరుగుతున్న కార్యక్రమాలకు చాలా భిన్నమైందని, విలువలతో కూడిన జీవన విధానం నేటి యువత నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి పుచ్చలపల్లి సుందరయ్య గ్రంథాలయ కమిటీ కన్వీనర్ కంది విశ్వనాథం అధ్యక్షత వహించగా బి.సోమయ్య, పి.ఆదిశేషు, మంచెల్ల ఇస్సాకు, జె.గోపి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

జంగారెడ్డిగూడెం టౌన్ : బిజెపి అధికారంలోకి వచ్చాక కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలతో నిరంతరం ప్రజలపై పెనుభారాలు మోపుతుందని, బిజెపి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా ఈనెల 16వ తేదీన రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బర్రె బాలరాజు తెలిపారు. మంగళవారం జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిఐటియు, డివైఎఫ్ఐ ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి వి.రాజు అధ్యక్షత వహించగా బాలరాజు మాట్లాడుతూ దేశ సంపదను బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు, 550 రైతు సంఘాలకు పాతినిధ్యం వహిస్తున్న కిసాన్ సంయుక్త మోర్చా అఖిల భారత కిసాన్ సభ ఈనెల 16వ తేదీన జరుగుతుందని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్, జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : మోడీ ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెకు సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఒక తీర్మానంలో సంపూర్ణ మద్దతు ప్రకటించింది. 16న జరిగే నిరసన కార్యక్రమంలో సిపిఎం శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, ఎం.నాగమణి, జి.రాజు, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, వై.నాగేంద్రరావు, తెల్లం దుర్గారావు, జి. వెంకట్రావు, బి.సోమయ్య పాల్గొని మాట్లాడారు.

చాట్రాయి : ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, దుర్గం పుల్లారావు, రైతు సంఘం మండల కార్యదర్శి చాగంటి రాజారావు తెలిపారు. మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనంగా జరిగే బంద్‌లో అందరూ పాల్గొనాలని కోరారు.

కలిదిండి : ఈనెల 16వ తేదీన జరిగే గ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. కలిదిండిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక దేశ వ్యాప్త పిలుపులో భాగంగా రైతులు, వ్యవసాయ కార్మికులు, వత్తి, కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు షేక్ అబిదా బేగం పాల్గొన్నారు.

చింతలపూడి: ఈనెల 16న దేశవ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.సత్యనారాయణ అన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీలు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తలపెట్టిన జాతీయ సమ్మె, గ్రామీణ ప్రాంత బంద్‌ను జయప్రదం చేయాలని చింతలపూడి సిఐటియు ఆధ్వర్యంలో కరపత్ర అవిష్కరణను ఎం.బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు.

ఉంగుటూరు: కార్మిక, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న జరుగుతున్న గ్రామీణ భారత్ బంద్-పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు కోరారు. ఈమేరకు కౌలు రైతుల సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో కైకరంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీరామ చంద్రమూర్తి, చిత్తా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

393 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని వైద్యాధికారి ఆంజనేయులు తెలిపారు. మండలంలోని వెలగపాడు పంచాయతీలోని వీరభద్రవరం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆంజనేయులు మాట్లాడుతూ వైద్య శిబిరం ద్వారా 393 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీరివ్వకపోవడం ప్రభుత్వ వైఫల్యమే

ముదినేపల్లి: మినుము పైరుకు నీరందించకపోవడం ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమేనని నియోజకవర్గ టిడిపి యువనేత కొడాలి వినోద్ అన్నారు. మండలంలోని చినకామనపుడి పంచాయతీ పరిధిలో మినప పొలాలకు సరిగ్గా నీరు అందక మొక్కలు ఎండిపోగా కొడాలి వినోద్ మంగళవారం రైతులతో కలిసి ఎండిపోయిన పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ప్రభుత్వ వైఫల్యమేనని, పొలాలకు సరైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తలారి రామకృష్ణ, తలారి రంగారావు, కత్తుల ఫణి పాల్గొన్నారు.

సచివాలయం సందర్శన

ముదినేపల్లి: ముదినేపల్లి ఎంపిడిఒ ఎస్ఎం.గంగాధర్ రావు మంగళవారం ముదినేపల్లి సచివాలయం-1ను సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న కాలనీల లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్స్, జలజీవన్ మిషన్ సర్వేపై ముదినేపల్లి-1 సచివాలయం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి ఆయన తగు సూచనలు చేశారు.

చిన్నారికి ఎస్ఐ సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో సేవ చేయాలనే ఉద్దేశ్యంతో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాలురకు ముసునూరు ఎస్ఐ పి.వాసు ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం రాజమండ్రి పరిధిలోని నమావరం అనే గ్రామానికి చెందిన మూడు సంవత్సరాల మని భార్గవ్ గుంటూరు భ్లూసమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోషల్ మీడియా ద్వారా ఆర్థిక సహాయం కోరగా, ఎస్ఐ వాసు రూ.80 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మండల అధికారులు, ప్రజలు, పోలీస్ శాఖాధికారులు అభినందనలు తెలియజేశారు.

CHANGE OF NAME

I, SUGUNA BOORADA (Old Name), W/o. MURALI KRISHNA, Resident of D.No. 20C-11-5, Tumarada vari Street, Tagore Centre, Eluru-534002, A.P. I have changed my Name as TUMARADA VENKATA SUGUNA (New Name), W/o. MURALI KRISHNA, Hereafter my name is known as TUMARADA VENKATA SUGUNA (New Name), W/o. MURALI KRISHNA

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 18/2023 in O.S. 299/2018

బిట్వీన్:
ముళ్ళపూడి నాగేశ్వరరావు -DHR
మరియు
దేవా బాలకృష్ణ -JDR

JDR: దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, డో.నెం. 2-36, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం.

పై నెంబరు గ్రంథము నందు JDR అయిన మీకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు U/Order 21, Rule 22 CPC నోటీసులు పంపినప్పటికీ మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు పై నెంబరు గ్రంథములో ఈ యొక్క పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది ఏమనగా పై నెంబరు గ్రంథము డి. 26-02-2024వ సం॥ వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని॥లకు మీరు గాని, మీ యొక్క వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క అక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల మీకు వ్యతిరేకంగా తీర్మానం జరుగును అని ఈ యొక్క పత్రికా ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

శ్రీనివాసరావు ముళ్ళపూడి
న్యాయవాది
తాడేపల్లిగూడెం
డి.12-2-2024 సెల్: 8919071651

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P. 19/2022 in O.S. 305/2018

బిట్వీన్:
కరుటూరి రామకృష్ణ -DHR
మరియు
దేవా బాలకృష్ణ -JDR

JDR: దేవా బాలకృష్ణ, S/o. పోలారావు, డో.నెం. 2-36, జగన్నాధపురం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం.

పై నెంబరు గ్రంథము నందు JDR అయిన మీకు శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం ఎన్ని పర్యాయములు U/Order 21, Rule 37 CPC నోటీసులు పంపినప్పటికీ మీరు సదరు నోటీసులు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. పై కోర్టు వారి ఆర్డరు ప్రకారం మీకు పై నెంబరు గ్రంథములో ఈ యొక్క పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది ఏమనగా పై నెంబరు గ్రంథము డి. 26-02-2024వ సం॥ వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10.30 ని॥లకు మీరు గాని, మీ యొక్క వకీలు ద్వారా గాని హాజరు అయి మీ యొక్క అక్షేపణలు తెలియచేయవలెను. లేనియెడల మీకు వ్యతిరేకంగా తీర్మానం జరుగును అని ఈ యొక్క పత్రికా ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

శ్రీనివాసరావు ముళ్ళపూడి
న్యాయవాది
తాడేపల్లిగూడెం
డి.12-2-2024 సెల్: 8919071651